క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న త్యాగి

తుక్కుగూడ: పురపాలిక కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఖోఖో అండర్- 14, 17 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం విజేత జట్టు సభ్యులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఖోఖో ఫెడరేషన్ చైర్మన్ ఎంఎస్ త్యాగి, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, మౌనిక, మహేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం

బడంగ్‌పేట్: ప్రజాసమస్యలపై సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పార్టీ ముందుంటుదన్నారు. 78 ఏళ్లుగా అనేక పార్టీలు అధికారం చేపట్టి, ఆస్తులు కూడబెట్టుకున్నాయే తప్ప, ప్రజలకు న్యాయం చేయలేదని ఆరోపించారు. ఎస్పీఐ పార్టీ మాత్రమే పేదల పక్షాన నిలబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నాయీబ్రాహ్మణుల నిరసన



నిరసన వ్యక్తంచేస్తున్న నాయీబ్రాహ్మణులు

కందుకూరు: నాయీబ్రాహ్మణేతరులు కూడా సెలూన్లు ఏర్పాటు చేసుకునేలా తెచ్చిన ఆర్టికల్ 19ని ఎత్తివేయాని ఆ సంఘం మండల అధ్యక్షుడు పి.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న తమను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఇతర కులాలకు చెందిన వారికి సెలూన్ల ఏర్పాటుకు అనుమతించరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు జి.కృష్ణ, ఎస్.విష్ణు, జి.శివకుమార్, జి.రాజు, జి.మహేందర్, పి.కృష్ణ, జి.నగేష్, కె.విష్ణు, జి.ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పి.సబితారెడ్డి

మహేశ్వరం: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ తల్లి లక్ష్మమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించారు. అనంతరం లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంబయ్య యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆనందం, మాజీ సర్పంచ్‌లు యాదయ్య, మల్లేశ్ యాదవ్, ప్రియాంక పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ స్థలాన్ని మార్చాలని వినతి

కొందుర్గు: మంలడల పరిధిలోని ఆగిర్యాలలో నూతనంగా నిర్మించనున్న పంచాయతీ భవనాన్ని నిర్మాణ స్థలాన్ని మార్చాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ స్థలంలో ఇదివరకే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జ్యోతిరావు పూలే, భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ తదితర మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించామని.. గ్రామంలో ఏ కార్యక్రమమైన ఇక్కడే నిర్వహించడం జరుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇక్కడ గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించినట్లయితే మహనీయుల విగ్రహాలకు అడ్డుగోడ పెట్టినట్లు అవుతుందని వివరించారు.

రేపు విద్యా సంస్థల బంద్

మొయినాబాద్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 23న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేస్తోందని ఆరోపించారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయలేదన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని.. అందుకు సమగ్ర చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వానాకాలం.. జరపైలం

- విద్యుత్ తీగలతో జాగ్రత్త
- అప్రమత్తతే శ్రీరామరక్ష



మహేశ్వరం మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్



మన్సాన్‌పల్లి చౌరస్తాలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మహేశ్వరం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు చాలా జరుగుతుంటాయి. ఇళ్లు, పంట పొలాల్లో విద్యుత్ వినియోగంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుత సీజన్‌లో బోరుబావులు, వాగులు, కాల్వల వద్ద విద్యుత్ మోటార్లు బిగించి, పంటలు సాగు చేస్తారు. ఈ సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కర్షకులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. అలాగే అనుమతి లేని వ్యక్తులు ఫ్యూజులు, వీధి దీపాలు మార్చడం చేయకూడదు. ఇంట్లో ఎర్తింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. రేకుల ఇళ్లకు కరెంట్ తీగలు తగలకుండా చూసుకోవాలి. ఎక్కడ ఏమాత్రం చిన్నగా తెగి, తగిలినా పెద్ద ప్రమాదం తప్పదని అనేక సంఘటనలు రుజువు చేశాయి.

ఇవి చేయరాదు

ఇంట, బయట ఉతికిన దుస్తులు ఆరేసుకునే సమయంలో విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇనుప తీగలపై వేయరాదు. కర్రలకు తీగలు అమర్చిన చోట తాకరాదు. విద్యుత్ స్తంభాలు ముట్టుకోకూడదు. వాటర్ హీటర్ స్విచ్ఛాఫ్ చేసి, ప్లగ్ తీసిన తర్వాతే నీటి పాత్రను పట్టుకోవాలి. ఉరుములు మెరుపులతో వర్షం పడినప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలి. ముఖ్యంగా సెల్ ఫోన్ చార్జింగ్ పెడుతూ మాట్లడకూడదు. విద్యుత్ తీగలు కిందకు వాలిన సమయంలో ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. చిన్న పిల్లలు విద్యుత్ పరికరాలను తాకకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో రైతులు మోటార్లు వేసే ముందు కాళ్లకు చెప్పులు వేసుకోవాలి. సొంతంగా విద్యుత్ పరికరాలకు మరమ్మతులు చేయరాదు. ఏదైనా సమస్య వస్తే.. తొలుత టెస్టర్‌ను ఉపయోగించి పరీక్షించాలి. మోటార్ తడవకుండా చూసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సుల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగకుండా చూడాలి. స్టార్టర్‌ను పొడి ప్రదేశంలో అమర్చాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే కరెంట్‌తో ప్రమాదాలు జరిగే అవకాశం చాలా తక్కువ.

మరమ్మతు చేయొద్దు



విద్యుత్‌తో జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వానాకాలం. తడి చేతులతో స్విచ్ వేయకూడదు. పంట పొలాల వద్ద రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు, మోటార్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం పడుతున్నప్పుడు టీవీ, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లు ఆఫ్ చేయాలి. లేదంటే వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. సరఫరాలో సమస్య ఉంటే సొంతంగా మరమ్మతు చేయవద్దు. లైన్‌మెన్, సిబ్బందికి తెలియజేయాలి.

–ఎం.చక్రపాణి, విద్యుత్ ఏఈ,మహేశ్వరం



బోనాల ఉత్సవంలో భాగంగా సోమవారం మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో అమ్మవారి పలహారం బండి ఊరేగింపును మాజీ కార్పొరేటర్ మల్లేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దప్పుచప్పుళ్ల మధ్య, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. – మీర్‌పేట

రహదారి విస్తరణ ఆవశ్యకతపై అవగాహన

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఎస్ఎంపీ పాఠశాలలో జాతీయ రహదారి విస్తరణ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ ఎన్‌హెచ్–163 రహదారి విస్తరణకు 45 రోజులుగా చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలలో అవగాహన సదస్సులు నిర్వహించి సమస్య తీవ్రతను ప్రజల దృష్టికి తీసుకువెళ్లామని సమితి సభ్యులు వెల్లడించారు. తక్షణమే జాతీయ రహదారిని విస్తరించి ఈ ప్రాంత అభివృద్ధికి ఉద్యోగ, ఉపాధికి, వ్యవసాయ ఉత్పత్తులో నగరానికి తీసుకురావడానికి, ఆరోగ్య సమస్యలతో మెరుగైన వైద్యం గురించి హైదరాబాద్ వచ్చే వారికి మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేయడానికి, పశ్చిమ రంగారెడ్డి జిల్లా అభివృద్ధి లోచన పోవడం చాలా విచారకర విషయమని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నట్లు కార్యక్రమం ద్వారా వివరించారు. సాధన సమితి సభ్యులకు తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టే వరకు దశల వారీగా స్థానిక శాసన సభ్యులకు పార్లమెంట్ సభ్యునికి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రోడ్డు దుస్థితి వారి దృష్టికి తీసుకొచ్చి ఒక టైంబాండ్ కార్యక్రమం ద్వారా వాళ్లకు నివేదిస్తూ న్యాయ సలహాలు కావాలిస్న న్యాయ సలహాలు తీసుకుంటూ రాజకీయంగా రాజకీయ నాయకులను ఈ పనులు జరిగేందుకు కృషి చేసేలా కలిసి తమ డిమాండ్‌ను తెలియజేయాలని నిర్ణయించారు.



మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త శ్రీనివాస్‌రెడ్డి

సేవలను విస్తృతం చేయాలి

లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ



రవికుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

షాద్‌నగర్‌రూరల్: సమాజాభివృద్ధిలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని కేకేఆర్ కన్వెన్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ 14వ వార్షికోత్సవ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా సంకల్ప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన క్లబ్ అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డి, సెక్రటరీగా విజేందర్‌రెడ్డి, ట్రెజరర్‌గా శ్రీరామ్‌గౌడ్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన క్లబ్ సభ్యులతో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శశికాంత్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవాదృక్పథాన్ని అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. పేదలకు చేయూతనిస్తూ వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కేబినెట్ సభ్యులు శరత్‌చంద్ర బాబు, ఎంపీఎస్.రంగయ్య, రీజియన్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ అమరేందర్‌రెడ్డి, కో చైర్మన్ డాక్టర్ శివానంద్, మదన్‌మోహన్‌రెడ్డి, శివనాగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు సదస్సుకు తరలిన దివ్యాంగులు



సభకు వెళ్తున్న పింఛన్‌దారులు

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం ఆమనగల్లు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల చేయూత పింఛన్‌దారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండలం నుంచి పింఛన్ లబ్ధిదారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిత్ర శ్రీను, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు మైసయ్య, యాదమ్మ, యాదయ్య, రమేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామానికి చెందిన జాటావత్ చందన్‌నాయక్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

మల్లికార్జున ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పుట్టిన రోజును పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి.. ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మైసమ్మ సన్నిధిలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సోమవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలకగా.. అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేశారు. సంప్రదాయం ప్రకారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు జవహర్‌లాల్, చెన్నయ్య, హీరాసింగ్, తులసీ రాంనాయక్, ప్రవీణ్, శ్రీను, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నియామకం



జయప్రకాష్

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సొసైటీ నూతన అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్ వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్ కాలనీలోని ఇందిరాంగాంధీ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ పాలకవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంకూరి జయప్రకాష్‌ను నియమిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సహకార అధికారి కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె.ఎల్లప్ప, కార్యదర్శిగా మల్లెల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా బి.ఫణికుమార్, పాలకవర్గం సభ్యులుగా పి.లలిత, జి.సురేఖ, వి.రమేష్, బి.శ్రీనివాస్‌గౌడ్, ఎం.ప్రభాకర్‌రెడ్డి నియమితులయ్యారు. అనంతరం అధ్యక్షుడు సంకూరి జయప్రకాష్ మాట్లాడుతూ... సొసైటీ సంక్షేమానికి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. స్థలాలను కాపాడుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

27న పలహార బండ్ల ఊరేగింపు

చంపాపేట: శ్రావణమాస బోనాలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎల్‌బీనగర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎడ్ల వాసుదేవరెడ్డి అన్నారు. ఈ నెల 27న కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని నల్ల పోచమ్మ అమ్మవారి శ్రావణ మాస బోనాల సందర్భంగా బజరంగదళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పలహారాల బండి ఊరేగింపు కార్యక్రమాల బ్రోచర్‌ను సోమవారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చేగోని నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 27 సాయంత్రం నాలుగు గంటలకు కర్మన్‌ఘాట్‌లోని కేకే ఎన్‌క్లేవ్ నుంచి క్రాంతినగర్, జ్యోతినగర్ కాలనీల నుంచి క్రాంతిక్లబ్ ఆవరణలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం వరకు పోతరాజుల విన్యాసాలు, శివసత్తులు, భక్తులతో కలిసి పలహార బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, బింటురెడ్డి, కార్తీక్, రమేష్, రఘుగౌడ్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎడ్ల వాసుదేవరెడ్డి

ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా సౌభాగ్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్‌లో రూ.30 లక్షలతో సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీ, పోచారంలో రూ.35 లక్షలతో సీసీరోడ్లు, గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన, ఎల్మినేడులో రూ.40 లక్షతో సీసీరోడ్లు, కుర్మసంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు.. ఉచిత విద్యుత్, బస్ ప్రయాణం, రుణమాఫీ ఇలా తదితర సంక్షేమ పథకాలను అందజేశామని పేర్కొన్నారు. రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, పట్నం శివశంకర్, బలరాం యాదవ్‌ల, ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అన్ని వర్గాల అభివద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలకొండ గ్రామానికి చెందిన పలువురు అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు కొండల్ రెడ్డి, హన్మంత్ రెడ్డి, జగన్ గౌడ్, జైపాల్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, రాంజీ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చేరదీసి.. సపర్యలు చేసి

ఆశ్రమంలో చేర్పించిన కానిస్టేబుళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసిన కానిస్టేబుళ్లు.. సపర్యలు చేశారు. భోజనం తినిపించి అనాథశ్రమంలో చేర్పించి, మానవత్వం చాటుకున్నారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వండర్‌లా పరిసరాల్లో చిరిగిన బట్టలు, మాసిన జుట్టు, చేతిలో గొడ్డలితో ఓ వ్యక్తి వింతగా ప్రవర్తిస్తూ తిరుగుతున్నాడు. ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ బురుగు బాల్‌రాజ్, కానిస్టేబుల్ శివాజీలు ఆ యువకున్ని చేరదీశారు. గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు రాబట్టే యత్నం చేసి విఫలం అయ్యారు. అనంతరం స్నానం చేయించి, కొత్తగా దుస్తులు వేయించారు. భోజనం తినిపించి మాతృదేవోభవ ఆశ్రమానికి తరలించారు. అనాథను చేరదీసి, మానవత్వం చాటుకున్న కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు, ప్రజలు అభినందించారు.



మతిస్థిమితం లేని వ్యక్తితో కానిస్టేబుళ్లు

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. కాలనీలో రూ.27లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కాలనీలో ఇంక కొంత మేర రోడ్డు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



శ్రీరామనగర్‌లో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి

కుండపోత వర్షం.. కర్షకుల హర్షం

యాచారం: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంట పాటు దంచికొట్టిన వానతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మండల కేంద్రంతో పాటు మాల్, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, నక్కగుట్టతండాల్లో భారీ వర్షం కురిసింది. సాగర్‌రోడ్డుపై నిలిచిన వరదతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుత వర్షం.. మెట్ట పంటలకు జీవం పోసేలా ఉందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి సాగు సజావుగా సాగనుందని పేర్కొన్నారు.



యాచారంలో కురుస్తున్న వర్షం